క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



నిత్యానందం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న నాయకులు

మడకశిరరూరల్: కొత్తలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు తమ్ముడు నిత్యానందం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. గురువారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్దన్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు శేషాద్రి, నాయకులు నాగభూషణరెడ్డి, దివాకర్, గోపి, నగేష్, ధనుంజయ, నాగరాజు, మంజునాథ్ తదితరులు పరామర్శించారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

గోరంట్ల: మండలంలోని వానవోలులో గురువారం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, మంజునాథ్, మాధవి ఆధ్వర్యంలో వానవోలు, వానవోలు తండా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో వికసిత్ సంకల్ప, అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగకు బదులుగా కంది, ఆముదం తదితర పంటలు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనాన్ని వడ్డించాలి



ఎండీఎం నిర్వాహకులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో అన్ని పాఠశాలల ఎండీఎం నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిబంధనల మేరకు మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ఎండీఎం నిర్వాహకులకు వంట తయారీ పోటీలు నిర్వహించారు. రత్నగిరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎండీఎం నిర్వాహకురాలు అనితమ్మ ప్రథమ, హొట్టేబెట్ట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎండీఎం నిర్వాహకురాలు వరలక్ష్మి, ద్వితీయ, అలుపనపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎండీఎం నిర్వాహకురాలు రాధమ్మ తృతీయ స్థానంలో నిలిచారు. వారికి ఎంఈఓ శ్రీధర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, ఎండీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యక్షురాలిగా మాలిన్ తాజ్



నూతన ఉపాధ్యక్షురాలు మాలిన్ తాజ్‌ను అభినందిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక మున్సిపల్ నూతన ఉపాధ్యక్షురాలిగా 19వ వార్డు కౌన్సిలర్ మాలిన్ తాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతకు ముందు ఉపాధ్యక్షురాలిగా విధులు నిర్వహించిన గీతా హనుమంతరాయప్ప తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ పడిన ఉపాధ్యక్ష స్థానానికి గురువారం ఎన్నిక అనివార్యమైంది. ఆ స్థానానికి మాలిన్ తాజ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎలాంటి పోటీ లేకుండా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు అధికారికంగా ప్రకటించారు. స్థానిక మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్, ఆరోగ్యాధికారి షంషు తదితర కౌన్సిలర్లు, ముస్లిం ప్రముఖులు నూతన ఉపాధ్యక్షురాలు మాలిన్ తాజ్‌ను ఘనంగా సన్మానించారు.

అలంకారప్రాయం

లేపాక్షి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. మండల వ్యాప్తంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 12 గ్రామ సచివాలయాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. లేపాక్షి-1 సచివాలయానికి రూ.35 లక్షలు మినహా మిగిలిన 11 గ్రామ సచివాలయాలకు సంబంధించి ఒక్కో గ్రామ సచివాలయం నిర్మాణానికి రూ.40 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. అయితే కల్లూరు, కంచిసముద్రం, చోళసముద్రం, శిరివరం, లేపాక్షి-1, లేపాక్షి-2, లేపాక్షి-3 సచివాలయాలు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. కల్లూరు, కంచిసముద్రం సచివాలయాలు ప్రారంభమయ్యాయి. మిగిలిన సచివాలయాల పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయాల వద్ద ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. భవనాలు పూర్తయి సంవత్సరం కావొస్తున్నా అవి నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పాత పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలు కురిసినప్పుడు భవనాల్లోకి నీరు చేరుతోంది. ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనాలను ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శిరివరం సచివాలయం చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరిగిన దృశ్యం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న లేపాక్షి-3 సచివాలయం



లేపాక్షిలో నిరుపయోగంగా ఉన్న సచివాలయాలు

చర్యలు తీసుకోవాలి..



శిరివరం గ్రామ సచివాలయ భవనం నిర్మాణం పూర్తయింది. ప్రారంభానికి నోచుకోక పోవడంతో ఆ భవనం అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారింది. గ్రామానికి దూరంగా ఉండటంతో మందు బాబులకు నిలయంగా మారుతోంది. అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న భవనంలో సిబ్బంది పని చేయడానికి, ప్రజలు కార్యాలయానికి వచ్చి సేవలు పొందడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకుని రావాలి.

– జయరామిరెడ్డి, శిరివరం

ముగిసిన సమ్మర్ క్యాంప్



బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం సమ్మర్ క్యాంప్ ముగిసింది. ముగింపు రోజు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి శ్రీనివాసులు, ఆర్పీ నాగేంద్రకుమార్, ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులు, పాఠకులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గత 45 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ మేరకు గ్రంథాలయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ.. 45 రోజులుగా పిల్లలకు వివిధ అంశాల్లో మెలుకువలు నేర్పించినట్లు తెలిపారు. పుస్తక పఠనం ఆవశ్యకత వివరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అతావుల్లా, డ్రాయింగ్ మాస్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలావాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, ఎంఈఓ గంగప్ప, కల్లూరు రాఘవేంద్ర రావు, రిటైర్డ్ హెచ్ఎం ఎంసీ గంగాధర్, ఉపాధ్యాయులు శ్రీశైలం, అఫ్జల్ బాషా, గ్రంథాలయాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే వరకూ పోరాటం



మాట్లాడుతున్న ఈరలక్కప్ప

అమరాపురం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసే వరకూ పోరాటం చేస్తామని మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. గురువారం మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈరన్నతో కలసి నాయకులతో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేద్దామన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. తాను నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలతో కలసి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలకు కలసికట్టుగా రావాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుందని, అయితే రైతుల వద్ద డబ్బులు లేక వేరుశనగ విత్తనకాయ తీసుకోవడానికి నగదు లేక రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదన్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు రైతు భరోసా నగదును ప్రతి సంవత్సరం అందించేవారన్నారు. హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయంలో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహరాజు, బీడీ మూర్తి, మంజునాథ, సిద్దేశ్వర, మక్బూల్ బాషా, రసూల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

మడకశిరరూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయక పోవడంతో అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మడకశిరలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తూ అండగా ఉంటుందన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం



విద్యార్థికి కరాటే బెల్టు ప్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ఇందిరా పార్కులో ఏఎస్ గోజు ర్యూ కరాటే ఇన్‌స్ట్రక్టర్ సెన్సేయి ఫైరోజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 41 మంది విద్యార్థులకు గురువారం ఆల్ ఇండియా ఏఎస్ గోజు ర్యూ కరాటే చీఫ్ బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ధనుంజయ, కేఆర్ శ్రీరాం, సీఎస్‌పీ మిథున్, మోహన్ బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డిగ్రీని సాధించారు. అలాగే 17 మంది ఎల్లో, ఒకరు ఆరెంజ్, 8 మంది బ్లూ, ఒకరు పర్పల్‌తో పాటు బ్రౌన్ బెల్టులు 4, 3, 2, 1, 0 గ్రేడ్‌లు మొత్తం 10 బెల్ట్‌లు సాధించారని కరాటే ఇన్‌స్ట్రక్టర్ సెన్సేయి ఫైరోజ్ తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ అల్తాఫ్ పాషా, సీనియర్లు ఉసమ, హేమంత్, చరణ్, నేహ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులు అందజేత



అవార్డులతో విద్యార్థులు, తల్లిదండ్రులు

అమరాపురం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో మండలంలోని 11 పాఠశాలల విద్యార్థులకు నగోనపల్లి శివకుమార్ చేతుల మీదుగా గురువారం ప్రతిభా అవార్డులు అందించారు. దళిత సంఘం నాయకులు ఎం.శివకుమార్, నారాయణ, కెంచప్ప, తిప్పయ్య, శివన్న, దేవరాజు, నవీన్, మూర్తి, ప్రసాద్, హనుమంతరాయప్ప తిప్పేస్వామి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వారి తల్లి దండ్రులను సన్మానించారు. నగోనపల్లి శివకుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు అవార్డులు ఇవ్వడం సంతోషదాయకమని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో మండల దళిత నాయకులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన 22 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు

పెనుకొండ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిబ కనబరచిన విద్యార్థులను బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో గుట్టూరు గ్రామంలో సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదివి 500 మార్కులకు పైగా సాధించిన 50 మంది విద్యార్థులను శాలువా, షీల్డ్‌తో సన్మానించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఐక్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ సూచించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, మత గురవులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవన నిర్మాణానికి కృషి



చంద్రశేఖరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా అధిక సంఖ్యలో ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థుల ఉచిత హాస్టల్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని తుమకూరు జిల్లా పాలు ఉత్పత్తి సంఘం డైరెక్టర్ బెళ్లిబట్లు చంద్రశేఖరరెడ్డి భరోసా ఇచ్చారు. పాడి రైతుల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్ శంకరరెడ్డి, మెడికల్ నాగభూషణ రెడ్డి, డెయిరీ రామాంజన రెడ్డి, జేసీబీ సుబ్బారెడ్డి, సంగీత నాగార్జున రెడ్డి, మంజునాథ్ రెడ్డి, హరీశ్ రెడ్డి, రైతు సంఘం నాయకులు నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక



అమర్‌వలి



రాజశేఖర్



నాగరాజు

పెనుకొండ: పెనుకొండ ఎలిమెంటరీ స్కూల్ టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులను గురువారం ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నిక్లో యూటీఎఫ్‌పై ఏపీటీఎఫ్ టీచర్స్ ప్యానెల్‌కు చెందిన ఏడుగురు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సొసైటీ గౌరవాధ్యక్షుడిగా అమీర్‌వలి, అధ్యక్షుడిగా రాజశేఖర్, కార్యదర్శిగా జవ్వాజి నాగరాజును ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు.

నేడు 'యోగాంధ్ర'పై జిల్లా స్థాయి సమావేశం

లేపాక్షి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:40 గంటలకు యోగాంధ్రపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన లేపాక్షిలో జిల్లా స్థాయిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి డీఆర్‌డీఏ పీడీతో పాటు జిల్లా స్థాయి అధికారులు హాజరవుతున్నారని వెల్లడించారు. మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

మార్కెట్‌యార్డు చైర్మన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న అశ్వర్థనారాయణ రెడ్డి

హిందూపురం: హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా అశ్వర్థ నారాయణరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, మార్కెట్ యార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నాగరాజు మృతి



సంతాపం తెలుపుతున్న సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి

అగళి: పీ బ్యాడగేర మాజీ సర్పంచ్ నాగరాజు (88) అనారోగ్యంతో కర్ణాటక రాష్ట్రం శిరాలోని ఓ ఆసుపత్రిలో గురువారం మృతి చెందారు. సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి శిరాకు వెళ్లి నాగరాజు మృతదేహంపై పూల మాల వేసి, నివాళులర్పించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో బుధవారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. హిందూపురం డీఎస్పీ, సీఐ జనార్దన్ గ్రామస్తులతో మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తికి పాముకాటు..



దామోదర్‌ను పరామర్శిస్తున్న ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దామోదర్ గురువారం పాము కాటుకు గురయ్యాడు. ఇంటి వద్ద ఉన్న తోటలో పశువులకు గడ్డి తీసుకు రావడానికి వెళ్లగా పాము కాటు వేసింది. బంధువులు అతడిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, చరణ్ రెడ్డిలు ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు జితేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: పట్టణ, మండల వ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల టీసీల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నాయి. అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎంఈఓ గంగప్పకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయన్నారు. ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి వేలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేశారన్నారు. ఇప్పుడు కూడా డబ్బు ఇవ్వనిదే టీసీలు ఇవ్వమని చెబుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ ఆఫ్రీద్, ఉమేష్, రాధిక్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నీరు పోస్తున్న వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీ దేవి



మొక్కకు నీరు పోస్తున్న అధికారులు



మొక్క నాటుతున్న మంత్రి సవిత

మడకశిరరూరల్/మడకశిర/పావగడ/రొళ్ల/మడకశిర/పరిగి/అమరాపురం/పెనుకొండ/పెనుకొండరూరల్/సోమందేపల్లి: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు మొక్కలు నాటి నీరు పోశారు. మడకశిర జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జడ్జి అశోక్‌కుమార్ కోర్టు మొక్కలు నాటారు. పర్యావరణ దినోత్సవం ప్రాధాన్యతను తెలియజేశారు. పెనుకొండలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీ శాఖామాత్యులు సవిత మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక సంకల్పంతో మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రేపటి తరానికి బంగారు భవిష్యత్తును అందించాలని కోరారు. మడకశిరలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీ దేవి ఆధ్వర్యంలో విద్యార్థులు సిబ్బంది మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.